# అమ్మ

ద్విభాష్యం రాజేశ్వరరావు



కృష్ణుడు బద్ధకంగా కళ్ళు విప్పేడు ;

అమ్మ తన ప్రక్కనలేదు :

పరుపుమీద ఇటూ అటూ దొర్లేడు. కిటికీలోంచి గాలి వెచ్చగా వీస్తోంది.

కిటికీ గూట్లో ఎండ పడుతోంది.

ఊచల ప్రక్కగా ఒక బుల్లి పిచ్చుక రెక్కలాడించుకుంటూ వచ్చి వాలింది.

కృష్ణుని వైపు చూసి కిచకిచ మంటూ తోక ఆడించింది.

కృష్ణుడు కళ్ళు విప్పార్చుకుని దాని వేపు చూశాడు. 'భలేవుంది పిచిక' అనుకున్నాడు. పిచ్చుకను అమ్మకు చూపించాలి. 'అమ్మా !' అని పిలుద్దామనుకున్నాడు. కాని శబ్దమయితే పిచ్చుక పారిపోతుందేమోనని భయంవేసింది. నిశ్శబ్దంగా పిచ్చుకవేపు చూస్తూ వుండిపోయాడు.

అది మళ్ళీ కిచకిచమంది.

కృష్ణుడు కూడా కిచకిచ మన్నాడు.

పిచ్చుక భయంగా చూసి ఇటూ అటూ అక్కడే గెంతింది. తరువాత రివ్వున ఎగిరిపోయింది.

కృష్ణుడు పక్కమీద లేచి కూర్చున్నాడు.

"అమ్మా !" అని పిల్చేడు.

అమ్మ పలకలేదు ;

మళ్ళీ పిల్చేడు గట్టిగా "అమ్మా !"

ఊహూ ! సమాధానం లేదు ;

పరుపుకు కడుపు ఆనించి మెల్లగా మంచం దిగేడు అయిదేళ్ళ కృష్ణుడు. జారిపోతున్న లాగును రెండుచేతులతో నడుం మీదకు ఎగలాగుతున్నాడు.

"అమ్మా !" మళ్ళీ పిలిచేడు.

సమాధానం లేదు ; ;

ఉక్రోశం ముంచుకొచ్చింది ;

మంకుతనం మరీ ఎక్కువయింది ;

"అమ్మా !" కాలు నేలమీద బాదుతూ అరిచేడు.

అమ్మ పలకలేదు ;

"అమ్మా !" అంటూ ఏడుపు లంకించుకున్నాడు.

ఏడుస్తూ గదిలోంచి బయటకు వచ్చేడు. హాలులోకూడా అమ్మలేదు.

వీధివేపు హాలు తలుపులు, కిటికీ తలుపులు మూసేసి వున్నాయి.

హాలులోంచి వెనక వరండాలోకి వచ్చి ఏడుపు ఆపి పిలిచేడు.

అమ్మ పలకలేదు ;

మెల్లగా వరండా మెట్లుదిగి పెరట్లోకి వచ్చేడు. బాదంచెట్టు క్రింద ఎర్రటి బాదంపండు రాలివుంది. మోచేత్తో కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళి దాన్ని తీసేడు. ఒకసారి ఇటూ అటూ చూసి దాన్ని కొరికేడు.

'ఛీ' అనుకుంటూ ఉమ్మేసి ఎంగిలి తుడిచేసి జేబులో పెట్టుకున్నాడు.

మెల్లగా నూతిదగ్గరకు నడిచేడు.

అక్కడ కూడా అమ్మ లేదు.

'బాత్‌రూం' దగ్గరకు వెళ్ళి పిల్చేడు "అమ్మా !"

అమ్మ పలకలేదు.

మెల్లగా తలుపు తోశాడు ;

రేకు తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది ;

'భలే !' అనుకున్నాడు. తలుపు మూసేడు. మళ్ళీ కిర్రుమంది తలుపు ; సంబరంగా నవ్వుకున్నాడు. తలుపు ఇటూ అటూ చాలాసార్లు కదిపేడు. కిర్రు కిర్రుమంటూ తలుపు సంగీతం పాడింది.



కొంతసేపు తలుపుతో ఆడుకున్నాక పూర్తిగా వెనక్కు తోశాడు.

'బాత్‌రూం' లోపలకు మెల్లగా అడుగుపెట్టేడు.

లోపల అమ్మలేదు!

కుళాయిలోంచి బొట్లు బొట్లుగా నీళ్ళు పడుతున్నాయి.

నీళ్ళక్రింద అరచేయి పెట్టాడు! నీటి బొట్లు చేతిలో రాలేయి.

వాటిని నోట్లో పోసుకున్నాడు. కుళాయి పట్టుకొని ఇటూ అటూ తిప్పేడు. కుళాయి కదల్లేదు. నీళ్ళు రాలేదు.

'బాత్‌రూం' లోంచి బయటకు వచ్చేడు.

"అమ్మా!" గట్టిగా పిలిచేడు.

"అమ్మా..." అంటూ ఏడుపు ప్రారంభించేడు మళ్ళీ.

అమ్మ తనని వదిలేసి ఎక్కడకూ వెళ్ళదు. ఇపుడు ఎక్కడకు వెళ్ళిందో!

"అమ్మా! ఎక్కడున్నావే?" అన్నాడు ఏడుపులోనే.

అమ్మ పలకలేదు!

పెరట్లోంచి మళ్ళీ వరండాలోకి వచ్చేడు! వరండాలో కుర్చీలు ఖాళీగా వున్నాయి వరండా దగ్గరనుండి మేడ మెట్లవేపు చూశాడు దగ్గరగా వెళ్ళి రెండు మెట్లు ఎక్కేడు. మూడోమెట్టు ఎక్కడానికి భయం వేసింది.

పైకి మెడ ఎత్తి నిటారుగా చూసేడు.

ఎత్తుగా వున్నాయి మెట్లు! 'ఆకాశమంత ఎత్తు వున్నాయి' అనుకున్నాడు.

ఏడుపు తనకి తెలియకుండానే ఆగిపోయింది. మళ్ళీ కళ్ళు తుడిచేసుకున్నాడు

ప్రక్కనున్న ఊచల్ని పట్టుకొని మళ్ళీ ఎక్కుదామని ప్రయత్నించేడు.

'అమ్మో! పడిపోతేనో!' అనుకున్నాడు. ఎక్కిన రెండు మెట్లూ మెల్లగా దిగిపోయాడు.

మెట్లవేపు చూసి 'అమ్మా!' అని పిలిచేడు.

సమాధానం లేదు!

వరండాలోంచి మళ్ళీ హాలులోకి వచ్చేడు!

హాలు కిటికీ దగ్గిర సీతాకోకచిలుక వాలి వుంది.

దాన్ని చూడగానే సంబరంగా చప్పట్లు కొట్టేడు!

'పురుగు, పురుగు' అనుకున్నాడు!

దాని దగ్గరగా వెళ్ళి 'వూ' అంటూ వూదేడు! పురుగు కదల్లేదు! ఇంకా దగ్గరగా నోరుపెట్టి 'వూ' అంటో మళ్ళీ ఊదేడు!

ఉహూ! పురుగులో ఈసారి కూడా చలనంలేదు!

మెల్లగా చూపుడువేలుతో రెక్కల మీద ముట్టుకున్నాడు.


రెక్కలు మెత్తగా తగిలేయి పురుగు రెపరెపలాడింది.

"అమ్మో!" అంటూ చేయి వెనక్కు తీసేసుకున్నాడు.

సీతాకోకచిలుక రివ్వున ఎగిరి పోయింది. తిన్నగా వెళ్ళి గోడగడియారం మీద వాలింది.

కృష్ణుడు దానివేపే చూస్తూ వుండి పోయాడు

అది గడియారం మీదనుండి చాలా సేపు కదల్లేదు.




'ఉస్, ఉస్' అంటూ అరిచేడు ! ఉహూ ! చప్పట్లు కొట్టేడు ! అయినా కదల్లేదు !

కృష్ణుడికి విసుగేసింది !

గడియారం అద్దంలోపల చిన్న బిళ్ల ఇటూ అటూ కదుల్తోంది. దానివంకే చూస్తూ వుండిపోయాడు. దాని కదలిక చాలా తమాషాగా అనిపించింది వాడికి.

అంతలో గడియారం టంగు టంగు మంటూ గంటలు కొట్టింది.

"ఒకటి, రెండు, నాలుగు" అంటూ లెక్క పెట్టాడు.

అమ్మో ! నాలుగు గంటలయి పోయింది! అనుకున్నాడు.

అమ్మ ఎక్కడికి వెళ్ళిందో ! నాలుగు గంటలయినా రాలేదు.

గదిలోకి వెళ్ళి మంచంకింద దూరేడు ! మంచం క్రింద చిన్న బుట్టలో లక్కపిడతలు వున్నాయి. బుట్ట మెల్లిగా బయటకు లాగేడు. ప్రక్కనేవున్న ఏనుగు బొమ్మకూడా బయటకు తీసేడు!

ఏనుగుకి ఓ కాలు విరిగిపోయింది !

విరిగిపోయినకాలు లక్కపిడతల మధ్యనుండి బయటకు తీసి ఏనుగుకి అతకటానికి ప్రయత్నించేడు.

అతుక్కోలేదు ! కాలు క్రింద పడి పోతోంది !

"నీకు ఇంజెక్షను ఇస్తాను. పాపం, కాలు విరిగిపోయింది కదూ !" అన్నాడు ఏనుగుతో.

ఏనుగు మాట్లాడలేదు !

"నీకు మాటలు రావా ?" అన్నాడు.

ఏనుగు ఈసారి కూడా మాట్లాడ లేదు !

"నీకు మాటలు రావులే !" అన్నాడు మళ్ళీ.

బుట్టలోంచి చీపురుపుల్ల తెచ్చి లక్క పిడతలోంచి 'స్' అంటూ మందుతీసేడు.

తరువాత ఏనుగుకి చీపురుపుల్లతో ఇంజక్షన్ చేశాడు.

ఏనుగును పడుకో బెట్టాడు !

లక్కపిడతలన్నీ ఒకవారగా సర్ది "ఏనుగూ, నీకు అన్నం వండిపెడతాను, ఏం ?" అన్నాడు.

లక్కపిడతను బుల్లి పొయ్యిమీద పెట్టాడు.

పప్పులేవీ కనబడలేదు. వంట వండటం ఎలా ?

"అమ్మా ! పప్పులు కావాలి !" అంటూ అరిచేడు.

అమ్మ పలకలేదు.

"అమ్మా !" అంటూ ఏడుపు ప్రారంభించేడు.

గదిలోంచి ఏడుస్తూ హాలుదాటి వరండాలోకి వచ్చేడు. మేడమెట్ల దగ్గర నిలబడి ఏడుపు తారాస్థాయికి పెంచేడు.

"అమ్మా !" ఏడుపులోనే అరిచేడు.

"వస్తున్నా బాబూ ! అప్పుడే నిద్ర లేచిపోయావా ?" అంటూ వాళ్ళమ్మ గబగబా మేడమెట్లు దిగింది ! కృష్ణుణ్ణి ఎత్తుకొని "అయ్యో ! కళ్ళలా వాచి పోయాయో !" అంటూ గుండెలకు హత్తుకొని ముద్దుపెట్టుకొని వాడి చెక్కిళ్ళు తుడిచింది. కృష్ణుడు గువ్వలా వాళ్ళమ్మ గుండెల్లో ఒదిగిపోయాడు.

నవ్వుతూ మేడమెట్లు దిగుతున్న భర్త వైపు కొంటెగా చూస్తూ "మీకు వేళాపాళా లేదు! చూడండి, ఏడ్చి ఏడ్చి అబ్బాయి కళ్ళు ఎలా వాచిపోయాయో?" అంటూ కృష్ణుడి వీపుమీద నిమురుతూ "కృష్ణా! నీకు చాక్లెట్ ఇస్తాను. ఇక ఏడవకు !" అని సముదాయించి గదివైపు సాగిపోయింది.